

దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు, ఆగస్టు 31:తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు రేపటి వరకూ దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ వీవీ గీతాలక్ష్మీ పట్నాయక్ తెలిపారు. ఈనెల 3న ఉదయం 10గంటలకు వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలోఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొ న్నారు. తెలుగు, వాణిజ్య, రాజనీతి శాస్త్రం, హిందీ, జంతు, వృక్షశాస్త్రం, ఉర్దూన బ్జెక్టుల్లో ఒక్కపోస్టు, కంప్యూటర్ సైన్ అండ్ అప్లికేషన్స్‌లలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.



బీట్ ఆఫీసర్లతో డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్

అటవీ సంరక్షణ సోషల్‌వర్క్ లాంటిది

● జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్

వికారాబాద్, ఆగస్టు 31 : అటవీ సంరక్షణ సోషల్ వర్క్ లాంటిదని, సమాజంలో ప్రతీఒక్కరిని కలుపుకుపోతూ అడవులను సంరక్షించాలని జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ తెలిపారు. శనివారం తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 35వ బ్యాచ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు 33 మంది వికారాబాద్‌లో జరుగుతున్న అటవీశాఖ పనులను, అనంతగిరి ప్రాంతాన్ని వారి శిక్షణలో భాగంగా సందర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అటవీ సంరక్షణ సంక్లిష్టంగా మారిన దృష్ట్యా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు పనితీరును మెరుగు పర్చుకోవాలని సూచించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కోర్స్ డైరెక్టర్ గంగారెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీ శ్యామ్ కుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అరుణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పశుగణనకు సన్నద్ధం!

● నేటి నుంచి ఇంటింటికీ ఎన్యుమరేటర్లు
● తొలిసారిగా యాప్‌లో వివరాల నమోదు
● నాలుగు నెలల పాటు కొనసాగనున్న 21వ జాతీయ పశుగణన

4

అవినీతి అధికారుల్లో వణుకు!

ఉమ్మడి జిల్లాలో చెరువులు, కుంటల్లో భారీగా అక్రమ నిర్మాణాలు

● వాటికి అనుమతిచ్చిన వారిపై సర్కార్ ఆరా
● తవ్వేకొద్దీ బయట పడుతున్న పలు శాఖల అధికారుల పేర్లు
● ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు.. హైడ్రా దూకుడుతో ఆందోళన

అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. చెరువులు, కుంటలు, నాలాల్లో నిర్మాణాలకు అక్రమంగా అనుమతులు ఇచ్చిన అధికారులకు ఇప్పుడు హైడ్రా కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. చెరువు, బఫర్‌జోన్లు, పార్కుల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా అసలు వాటికి అనుమతులు ఇచ్చిన వారిపై చర్యలకు దిగింది. ఇప్పటికే కొందరు అధికారులపై కేసులు నమోదు చేశారు. ఇంకా అనేకమంది అధికారులకు నోటీసులు ఇచ్చారు. దీంతో ఎప్పుడు తమకు కూడా ఈ నోటీసులు వస్తాయో.. తమను కూడా అరెస్టు చేస్తారేమోనన్న భయం కొందరు అధికారుల్లో పట్టుకుంది. హైడ్రా దూకుడుగా చర్యలకు దిగడం, ఉన్నత స్థాయిలో ఉన్న వారి నిర్మాణాలను కూడా కూల్చుతుండడంతో తమపై కూడా చర్యలు తప్పవన్న భావనలో అధికారులున్నారు.



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వం అక్రమాలకు కారకులైన ప్రభుత్వ సిబ్బందిపై కూడా చర్యలకు రంగం సిద్ధం చేస్తుండడంతో కొందరు అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. నగర, శివార్లలోని చెరువులు, నాలాలు, పార్కులు, లే అవుట్‌లోని ఖాళీ స్థలాలు, ఆట స్థలాలు, రహదారులు, ఫుట్‌పాత్‌ల పరిరక్షణ, వాటిలోని ఆక్రమణల తొలగించేందుకు ప్రభుత్వం ఇటీవల హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ)ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. హైడ్రాకు సమర్థులైన అధికారులను నియమించి వారికి ప్రత్యేకాధికారాలను కూడా ఇచ్చింది. దీంతో విధుల్లో చేరిన అధికారులు వెంటనే రంగంలో దిగి చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు, పార్కుల్లో నిర్మాణాలను నేలమట్టం చేస్తూ అక్రమార్కులకు దడ పుట్టిస్తున్నారు. ఇప్పటికే మేడ్చల్, రంగారెడ్డి జిల్లా పరిధిలో పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. గండిపేటలో మాజీ కేంద్ర మంత్రి పళ్లంరాజుతో సహా ఇతర ప్రముఖుల ఫామ్‌హౌస్‌లను కూల్చివేశారు. అలాగే సినీ హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూడా కూల్చివేయడం ద్వారా అక్రమార్కులకు గట్టి హెచ్చరికలే పంపారు. ఇంకా పలువురు ప్రముఖులకు చెందిన ఇళ్లు, ఫామ్‌హౌస్‌ల అక్రమ నిర్మాణాలకు సంబంధించి నోటీసులు జారీ చేస్తున్నారు. మాదాపూర్ చెరువు బఫర్ జోన్‌లో ఇళ్లు నిర్మించిన వారందిరకీ నోటీసులు జారీ చేశారు. ఇందులో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి కూడా నోటీసులు అందాయి. ఇదిలా ఉంటే అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన వారి సంగతేమిటనే ప్రశ్నలు రావడంతో ప్రభుత్వం దీనికి సమాధానంగా చర్యలకు దిగింది. చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు ఇప్పటికే కొందరు అధికారులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు సిఫారసు

కబ్జాల పర్వం 2

చేశారు. ఇందులో మేడ్చల్ జిల్లా పరిధిలో పనిచేసే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఉన్నారు. హైడ్రా సిఫారసుల ఆధారంగా నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, చందానగర్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ సుధాంశు, చందానగర్ సర్కిల్ సహాయ ప్రణాళికాధికారి రాజ్‌కుమార్, హెచ్ఎండీఏ ఏపీఓ సుధీర్‌కుమార్, బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సర్వే ఆఫ్ ఏడీ శ్రీనివాస్‌లపై చర్యలు తీసుకున్నారు. వీరందరిపై శనివారం సైబరాబాద్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎర్రకుంట చెరువు శిఖంలో తహసీల్దార్, నిజాంపేట కమిషనర్ అనుమతులు ఇచ్చారు. వీటిని ఇటీవలే హైడ్రా కూల్చి వేసింది. అలాగే చందానగర్ సర్కిల్ పరిధిలోని ఈర్లచెరువు ఎఫ్‌టీఎల్‌లో మూడు భవంతులకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చారు. వీటి నిర్మాణం పూర్తి కాకుండానే నివాస యోగ్యతాపత్రం ఇచ్చారు. ఇక్కడ నీటి పారుదల శాఖ ఎన్వోసీ ఇవ్వాల్సి ఉండగా ఆ స్థానంలో సహాయ ప్రణాళికాధికారి రాజకుమార్ చుక్కలను వివరణగా రాసి అనుమతికి సిఫారసు చేయడం గమనార్హం. ఇలా అసంపూర్తి వివరాలతో ఉన్న నివేదికను ఉపకమిషనర్ సుధాంశ ఆమోదించారు. దీంతో వీరిద్దరిపై చర్యలకు సిఫారసు చేశారు. ఇక మేడ్చల్ జిల్లాలో చెరువు ఆక్రమణలపై హైకోర్టు నివేదిక కోరగా ఏడీ శ్రీనివాస్ తప్పుడు సమాచారం పంపారు. అలాగే ప్రభుత్వ భూమి అని బోర్డు ఉన్న చోట హెచ్ఎండీఏ ఏపీఓ సుధీర్‌కుమార్ అనుమతులు ఇచ్చారు. అదేవిధంగా గండిపేట జలాశయ పరిధిలో ఆక్రమణలకు సహకరించిన కొందరు ఇరిగేషన్ అధికారులపై కూడా చర్యలకు రంగం సిద్ధమైంది. మేడ్చల్ జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్, చెరువు శిఖం స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చిన అధికారులపై ప్రభుత్వం చర్యలకు దిగడంతో మిగతా ప్రాంతాల్లో అక్రమాలకు పాల్పడిన అధికారులకు దడ మొదలైంది. శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్, మొయినాబాద్, శంకరపల్లి, మహేశ్వరం, సరూర్‌నగర్, పెద్ద అంబర్‌పేట, మేడ్చల్, శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మల్కాజిగిరి తదితర మండలాల్లో అక్రమ నిర్మాణాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న కొందరు అధికారులతో పాటు గతంలో పనిచేసిన అధికారుల కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలు జరిగాయి. దీంతో అప్పట్లో అక్రమాలకు సహరించిన అధికారులు ఇపుడు ముచ్చెమటలు పడుతున్నాయి.

ఎఫ్‌టీఎల్‌నే మార్చేశారు

ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో గత కొన్నేళ్లుగా చెరువుల, కుంటలు, నాలాలు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు పెద్ద ఎత్తున కబ్జాకు గురయ్యాయి. ఇందులో పాలకుల పాత్ర కూడా ఉంది. కొందరు బడా నేతల కోసం చెరువుల ఎఫ్‌టీఎల్‌ను కూడా అధికారులను మార్చేశారు. గడిచిన పదేళ్లలో అనేక చెరువులకు కొత్తగా ఎఫ్‌టీఎల్ ఫిక్స్ చేశారు. కొందరు అక్రమాలకు పాల్పడేందుకు అనుకూలంగా ఇదంతా జరిగింది. ఇక ప్రభుత్వ భూములను పట్టా భూములుగా మార్చేశారు. ఇలాంటి అధికారులు అనేకమంది ఉన్నారు. ఇపుడు వీరందరిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అయితే, ఇది ఆరంభ శూరత్వంగానే మిగిలి పోతుందా? బడా అధికారులపై చర్యలు తీసుకుంటారా? అనేది వేచిచూడాలి.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభమైన వర్షం శనివారం కూడా కొనసాగింది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురవడంతో జిల్లాలో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కుంటలు, చెరువులు, ప్రాజెక్టులు, చెరువుల్లోకి భారీగా నీరు చేరింది. పలుచోట్ల చెక్‌డ్యాంలు, కుంటలు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి. పలు మార్గాల్లో కాజ్‌వేలపై నుంచి వరద నీరు ఉధృతిగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పత్తి, కంది పంట పొలాల్లోకి వరద నీరు భారీగా చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. తోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి



రాళ్ల చిట్టంపల్లిలో నీట మునిగిన పత్తి పంట

✦ పలుచోట్ల వంతెనలపై నుంచి ప్రవహించిన వాగులు
✦ స్తంభించిన రాకపోకలు...
✦ నీట మునిగిన పంట పొలాలు..
✦ రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం
✦ ఇళ్లలోకి చేరిన వరదనీరు..తడిసిన సామగ్రి
✦ కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
✦ రంగారెడ్డి కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నెంబర్ 040-23237416
✦ వికారాబాద్ కలెక్టరేట్‌లో 08416-242136 నెంబర్లు ఏర్పాటు

ముసురు.. ముంచెత్తింది

అలుగు పారిన ప్రాజెక్టులు, చెరువులు



రావిర్యాల వాగు ఉధృతితో రాకపోకలు బంద్

ఆంధ్రజ్యోతి ఉమ్మడి జిల్లా నెట్‌వర్క్, ఆగస్టు 31 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ముసురు వాన ముంచెత్తింది. వికారాబాద్ జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురియగా, మిగతా ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పలు మార్గాల్లో కాజ్‌వేలపై నుంచి వరద నీరు ఉధృతిగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తాండూరు మార్గంలో బాచారం వద్ద వాగు పొంగి ప్రవహించగా, పీలారం, మద్గుల్ చిట్టంపల్లి, మోత్కుపల్లి, సిద్దులూరు, గిరిగెట్‌పల్లి, నారాయణపూర్, ధన్నారం, దోర్నాల వాగులు ఉధృతంగా ప్రవహించాయి. తాండూరు-పెద్దేముల్ మార్గంలో గాజీపూర్ సమీపంలో, ధారూరు మండలం, దోర్నాల్ వద్ద వాగులు పొంగి ప్రవహించడంతో ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. చౌడాపూర్, కులకచర్ల, దోమ, ధారూరు, కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, బషీరాబాద్, పూడూరు, పరిగి,వికారాబాద్ మండలాల్లో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో ప్రాజెక్టు, చెరువులు, కుంటల్లోకి భారీగా నీరు చేరి నిండుకుండల్లా మారాయి. పలు చెరువులు అలుగెత్తి ప్రవహిస్తున్నాయి. వికారాబాద్‌లోని శివసాగర్, మోమిన్‌పేట్‌లోని నందివాగు అలుగెత్తింది. కోట్‌పల్లి ప్రాజెక్టులోకి 21అడుగుల మేర నీరు చేరుకోగా, సర్పన్‌పల్లి ప్రాజెక్టు ఆదివారం ఉదయం వరకు అలుగెత్తి ప్రవహించే అవకాశంఉంది. వికారాబాద్, నవాబుపేట మండలాల మీదుగా కొనసాగే మూసీనది ఉధృతంగా ప్రవహిస్తోంది. అలంపల్లి నుంచి గిరిగెట్‌పల్లి మార్గంలో రైల్వే బ్రిడ్జి కింద నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచి పోయాయి. పరిగి శివారులోని వాగు బ్రిడ్జి మీదుగా ప్రవహించడంతో నస్కల్ మీదుగా వికారాబాద్ వైపు , దోర్నాలవాగు ఉధృతంగా ప్రవహించడంతో ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. కాగ్నా, మూసీ నదుల్లో వరద నీటి ఉధృతి క్రమేపీ పెరుగుతూ వస్తోంది. వాగులు ప్రమాదకరంగా ప్రవహించడంతో అప్రమత్తమైన వికారాబాద్ జిల్లాఎస్పీ నారాయణరెడ్డి, అధికారులు ముందు జాగ్రత్తగా పలు వాగుల వద్ద పోలీసు సిబ్బందిని మొహరింపజేశారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని దేవరాంపల్లి (ఈసీ) వాగు, షాబాద్ మండలంలోని తాళ్లపల్లి వాగు, శంకర్‌పల్లి మండలంలోని పతేపూర్ (మూసీ) వాగు, మొయినాబాద్ మండలంలోని వెంకటాపూర్ వాగు ఉప్పొంగింది. చౌదరిగూడ మండలం చేగిరెడ్డి ఘణాపూర్, రావిర్యాల తదితర గ్రామాల్లో వాగుల్లో నీటి ప్రవాహం కొనసాగింది.

కాలనీలు జలమయం.. దెబ్బతిన్న రోడ్లు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రోడ్లు, కాలనీలు జలమయమయ్యాయి. రోడ్లపై నిలిచిన వర్షం నీటితో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. నాగారం మున్సిపల్‌లోని కాలనీల్లో వర్షపు నీరుచేరి జలమయమయ్యాయి. మేడ్చల్ జాతీయరహదారి రోడ్డు వెడల్పు పనులకు ఆటంకం కల్గింది. రోడ్డుపై వర్షపు నీరు చేరడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న వారిని ఖాళీ చేసి సురక్షిత గృహాల్లోకి వెళ్లాలని కమిషనర్లు రాజేందర్‌కుమార్, నాగమణిలు సూచించారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం వాల్మీకి కాలనీలోని ఇళ్లలోకి వర్షపునీరు చేరడంతో అవస్థలు పడ్డారు. రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. వికారాబాద్‌జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు, లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. బషీరాబాద్‌లోని పంచాయతీ భవనం, జడ్పీ పాఠశాల ఆవరణలో వర్షం నీరు నిలవడంతో విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లేందుకు నానాఇబ్బందులు పడ్డారు. చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల,

- మిగతా 5వ పేజీలో

రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలి

రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లు శశాంక, ప్రతీక్‌జైన్



రంగారెడ్డి అర్బన్/వికారాబాద్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి, వికారాబాద్, జిల్లాల కలెక్టర్లు శశాంక, ప్రతీక్‌జైన్‌లు అన్నారు. జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అధికారులతో కలెక్టర్లు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాలకు ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేకంగా అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. రంగారెడ్డి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ట్రోల్ ఫ్రీ నెంబర్ 040-23237416 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వికారాబాద్ కలెక్టరేట్‌లో 08416242136 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారమివ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ చేయాలన్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న దేవరంపల్లి ఈసీ వాగు



బెల్కటూర్ గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న వాగు



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న రేణుకాదేవి

సమస్యల పరిష్కారానికి కృషి

● జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి

వికారాబాద్, ఆగస్టు 31 : జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పరిస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి అన్నారు. శనివారం ఎంఈవో బాబుసింగ్‌తో కలిసి పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే పాఠశాల భవనం కురుస్తోందని, శిథిలావస్థకు చేరిందని, గతంలో మనఊరు- మనబడి కింద కొన్ని పనులు చేపట్టినట్లు తెలిపారు. లైట్లు, ఫ్యాన్లు, నాలుగు రూమ్‌లకు మరమ్మతులు చేసినట్లు చెప్పారు. ఇలాంటివి జిల్లాలో 120పాఠశాలలో ఉన్నాయని, గతంలో మనఊరు-మనబడి కింద 451 పాఠశాలలు ఎంపిక చేసినట్లు చెప్పారు. డిగ్రీ కళాశాల కూడా ఇక్కడే కొనసాగుతుండగా మరో రెండు గదులు నిర్మించాలని కోరగా పరిశీలించినట్లు చెప్పారు. జడ్పీ కార్యాలయంలో మూడు రోజుల్లో విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, రీసోర్స్ పర్సన్లకు స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్‌పై అవగాహన కల్పించి పాఠశాలల్లో వారి ద్వారా విద్యార్థులకు ఆంగ్లంపై పూర్తి పట్టు సాధించేలా తరగతులు నిర్వహిస్తామని డీఈవో తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

● ఎస్పీ నారాయణరెడ్డి.. నవాబుపేట పీఎస్ సందర్శన

నవాబుపేట, ఆగస్టు 31 : విధుల పట్ల నిర్లక్ష్యం తగదని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. నవాబుపేట మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా మోమిన్‌పేట్ సీఐ నవీన్‌కుమార్, ఎస్సై అరుణ్‌కుమార్‌గౌడ్ పోలీసు సిబ్బందితో ఎస్పీని సన్మానించారు. అనంతరం నారాయణరెడ్డి రికార్డులను తనిఖీ చేసి పెండింగ్ కేసుల గురించి పోలీసులను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సూచించారు. ప్రతీరోజు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని, ట్రాఫిక్ నిబంధనలపై, సైబర్ నేరాల పట్ల వాహనదారులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఒకవేళ ప్రజలు సైబర్ మోసాలకు గురైతే డయల్ 1930కి సమాచారం అందించాలని సూచించారు. అశ్లీల వీడియోలతో బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు వసూలు చేయడం వంటి సంఘటనల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ నవీన్‌కుమార్, ఏఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

ఆర్డీవో సూరజ్ సేవలు అభినందనీయం



ఆర్డీవో సూరజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ శశాంక

కందుకూరు, ఆగస్టు 31: ఆర్డీవోగా సూరజ్‌కుమార్ చేసిన సేవలు అభినందనీయమని కలెక్టర్ శశాంక కొనియాడారు. శనివారం కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్ పదవీ విరమణ సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలో ఆయన్ను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. సూరజ్‌కుమార్ తక్కువ సమయంలోనే ఎన్నికల నిర్వహణ, డబుల్‌బెడ్ రూమ్‌ల కోసం స్థలాన్ని సేకరించడం, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారన్నారు. తహసీల్దార్లు కె.గోపాల్, ముంతాజ్‌బేగం, ఎంపీడీవోలు సరిత, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పశుగణనకు సన్నద్ధం!

- నేటి నుంచి ఇంటింటికీ ఎన్యుమరేటర్లు
- తొలిసారిగా యాప్‌లో వివరాలు నమోదు
- నాలుగు నెలల పాటు కొనసాగనున్న 21వ జాతీయ పశుగణన

వికారాబాద్/ మేడ్చల్ ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పశుగణనలో భాగంగా గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు, గేదెలు, ఆవులు.. తదితర జీవాల గణనకు వికారాబాద్, మేడ్చల్ జిల్లాల అధికారులు సన్నద్ధమవుతున్నారు. 2023లో 21వ జాతీయ పశుగణన నిర్వహించాల్సి ఉండగా, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల కారణంగా ఏడాది ఆలస్యం జరిగింది. పశుగణన ద్వారా ప్రభుత్వ పథకాల ద్వారా ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు పొందిన వారి వివరాలతో కోళ్ల ఫారాలు ఎన్ని ఉన్నాయనేది కూడా తెలియనుంది. కాగా, గత ఐదేళ్లతో పోలిస్తే జిల్లాలో వివిధ పశువుల సంఖ్య ఏ మేర పెరిగిందనేది స్పష్టత రానుంది.



ఎన్యుమరేటర్లు కీలకం

పశువులను లెక్కించడానికి తొలిసారిగా మొబైల్ యాప్ వినియోగిస్తున్నారు. యాప్‌లో వివరాలు నమోదు చేసేందుకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లాల్సి ఉంటుంది. ఇంటి యజమాని వివరాలతో పాటు భూమి, పశువుల వివరాలు, చూడి, పాడి పశువులు, జెర్సీ, ఇతర ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు తదితర మూగ జీవాల వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తారు. ఆవులు ఉంటే, వాటి వయస్సు, పాలు ఇచ్చేవి, ఇవ్వనివి, ఏ జాతి పశువులు అనే వివరాలు కూడా అప్‌లోడ్ చేస్తారు. 2019లో వికారాబాద్ జిల్లాలో నిర్వహించిన పశుగణనలో జిల్లాలో 1,72,506 ఆవులు, 80,401 గేదెలు, 2,37,536 గొర్రెలు, 2,54,144 మేకలు, 9,947 పందులు ఉన్నట్లు తేల్చారు. మేడ్చల్ జిల్లాలో 32 లక్షల 54 వేల 628 వివిధ రకాల పశు సంపద ఉంది. అందులో ఆవులు 27,068 , గేదెలు 59,895, గొర్లు 1,28,000, మేకలు 40,020, పందులు 2,085, కోళ్లు 29,39,407, కుక్కలు 57,082 ఉన్నవి. పశుగణనలో మొత్తం 16 జాతులకు సంబంధించిన వివరాలు సేకరించనున్నారు. అదేవిధంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పలు జాతులకు చెందిన పశువులు, పెంపుడు జంతువులు, పక్షుల వివరాలను సేకరిస్తారు. తెల్లజాతి, గేదె జాతి పశువులతో పాటు గొర్రెలు, మేకలు, కోళ్లు, పందులు, గాడిదలు, గుర్రాలు, వీధి కుక్కలు, ఈము, కుందేళ్లు, పిల్లులు, బాతుల వివరాలు కూడా నమోదు చేసుకోనున్నారు. పశుగణనలో ఎన్యుమరేటర్లు కీలకంగా వ్యవహరించనున్నారు. కనీసం నెలకు వెయ్యి ఇళ్ల వంతున నాలుగు నెలల లోపు పశుగణన పూర్తి చేయాల్సి ఉంటుంది.

గణకులకు శిక్షణ పూర్తి..

వికారాబాద్ జిల్లాలో పశుగణన నిర్వహించేందుకు 20 మంది పశు వైద్యాధికారులు, వైద్యులను పర్యవేక్షకులుగా నియమించగా, పశుసంవర్ధక శాఖకు చెందిన 118 మంది సిబ్బందిని ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేశారు. మేడ్చల్ జిల్లాలో 106 మంది ఎన్యుమరేటర్లను, 16 మంది పర్యవేక్షకులను, ఒక నోడల్ అధికారిని నియమించారు. నోడల్ అధికారిగా ఏడీఏ సుధాకర్‌ను నియమించారు. పశుగణనపై అవగాహన కల్పించేందుకు ఇటీవల వారికి శిక్షణ ఇచ్చారు. కాగా, ఆరేళ్ల కిందట జరిగిన పశుగణన ట్యాబ్‌ల్లో నిర్వహించగా, ఈసారి ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ను వినియోగిస్తున్నారు. గణన నిర్వహించే ఎన్యుమరేటర్లు యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఆ యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. మునిసిపాలిటీల్లో ఒక్కో వార్డుకు ఒక ఎన్యుమరేటర్‌ను కేటాయించగా, గ్రామీణ ప్రాంతాల్లో రెండు, మూడు గ్రామ పంచాయతీల్లో పశుగణన చేపట్టే బాధ్యతను ఒక ఎన్యుమరేటర్‌కు అప్పగించారు. నేటి నుంచి ప్రారంభమయ్యే పశుగణన డిసెంబరు 31వ తేదీ వరకు నాలుగు నెలల పాటు కొనసాగనుంది.

స్థానిక రైతులు సహకరించాలి

మేడ్చల్ జిల్లాలోని 5 మండలాలు, 9 మున్సిపాల్టీలు, 3 కార్పొరేషన్‌లలోని అన్ని వార్డులలో జాతీయ పశు గణన పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాం. క్షేత్రస్థాయిలో ప్రతి రైతు ఇంటికి ఎన్యుమరేటర్లు వెళ్లి పూర్తిస్థాయిలో సమాచారం సేకరించాల్సి ఉంటుంది. అధికారులు, సిబ్బంది గ్రామాలకు వెళ్లిన సమయంలో రైతులు, ప్రజలు సహకరించాలి. జిల్లాలో 106మంది ఎన్యుమరేటర్లు, 16 మంది సూపర్‌వైజర్లు గణనలో పాల్గొంటారు.

-ప్రభాకర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

పశు గణనకు ఏర్పాట్లు పూర్తి



జిల్లాలో పశుగణన నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. గణన నిర్వహించే ఎన్యుమరేటర్లు, ఈ ప్రక్రియ పర్యవేక్షించే సూపర్‌వైజర్లకు వారం రోజుల కిందట శిక్షణ తరగతులు నిర్వహించాం. గణనకు ఇంతకు ముందు ట్యాబ్‌లు వినియోగించగా, ఈసారి మొబైల్ యాప్ ద్వారా వివరాలు నమోదు చేయనున్నారు.

- పూర్ణచందర్‌రావు, డీవీఏహెచ్, వికారాబాద్



వైభవంగా హనుమాన్ పల్లకీ సేవ

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 31: మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి, స్వామి ఉత్సవ విగ్రహాలతో పల్లకీసేవ నిర్వహించారు. భజన పాటలు పాడుతూ ఆలయం చుట్టూ సేవ నిర్వహించారు. భక్తులకు హైదరాబాద్ కూకట్‌పల్లి ఆల్విన్ కాలనీకి చెందిన తుంగలి రామచంద్రయాదవ్ మంజుల దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతలను ఆలయ అభివృద్ధి కమిటీ కన్వీనర్ పి.శ్రీశైలంగౌడ్ సన్మానించి, అభినందనలు తెలిపారు.

చెరువులు, కుంటల ఆక్రమణదారులపై చర్యలు తప్పవు

- మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరం, ఆగస్టు 31 : నియోజకవర్గంలోని చెరువులు, కుంటలను కబ్జాలు చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టినవారు ఎంతటివారైనా వదిలేది లేదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత 8 నెలలుగా నియోజకవర్గంలోని చెరువులు, కుంటలపై తాను ప్రత్యేక దృష్టి సారించి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నానన్నారు. అభివృద్ధిని పక్కకు పెట్టి హైడ్రా డ్రామా ఆడుతున్నారని కొందరు బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడడం వారి రాజకీయ అవివేకమేనని అన్నారు. చెరువులను గత బీఆర్‌ఎస్ పాలకులు చెరబడితే కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసి చెరువులను రీ స్టోర్ చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట, మీర్‌పేట, తుక్కుగూడ తదితర ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు కబ్జాలకు గురయ్యాయని, వాటన్నింటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు కలెక్టర్, నీటిపారుదలశాఖ మంత్రిని కలిసి ఫిర్యాదు చేసినట్లు కేఎల్లార్ చెప్పారు. కబ్జాలు చేసిన నాయకులతో పాటు వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతు రుణమాఫీపై పూర్తిగా అవగాహన లేకుండా మాట్లాడుతున్న సబితారెడ్డికి త్వరలో రైతులే తగిన బుద్ధి చెబుతారన్నారు. నెల రోజుల్లో సాంకేతిక సమస్యలు పరిష్కరించి రైతులందరికీ పూర్తిగా రుణమాఫీ అయ్యేలా చూస్తామన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ అభివృద్ధిని గాలి కొదిలేసి కేవలం పార్టీ అభివృద్ధి కోసమే పాకులాడిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, హెల్త్‌సిటీతో పాటు మరిన్ని బడా పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. మండలాలు, మున్సిపాలిటీలకు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరయ్యాయని, వాటిని కేవలం సీసీరోడ్లు, అండర్‌డ్రైనేజీలకు మాత్రమే ఉపయోగించాలన్నారు. ఎలాంటి వివరణ లేకుండా తనపై కొందరు తప్పుడు వార్తలు రాస్తున్నారని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పీసీసీ కార్యదర్శి దేపభాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, ఈశ్వర్, రఘుపతి, వి.మల్లేష్‌యాదవ్, బి. వెంకట్‌రెడ్డి, నేనావత్ రాజునాయక్, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముసురు.. ముంచెత్తింది

1వ పేజీ తరువాయి..

షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లోని వానకు రహదారులు దెబ్బతిన్నాయి. వాహనదారులు ఇబ్బందులకు గురి అయ్యారు. పరిగి పట్టణంలోని పలు కాలనీలు బురదమయంగా మారాయి.

నీటమునిగిన పంటలు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో ఆ వాగుల పరీవాహక ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. కురుస్తున్న వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వికారాబాద్ మండలం, రాళ్లచిట్టంపల్లి గ్రామంలో పత్తి, కంది పంట పొలాల్లోకి వరద నీరు భారీగా చేరడంతో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. గూడ వచ్చే దశలో కురుస్తున్న ఈ వర్షాలతో పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. మరో రెండు రోజుల పాటు ఇలాగే వర్షం పడితే.. పత్తి, మొక్కజొన్నపంటలు పాడయ్యే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో పొలాల్లో నీరు చేరి మొలకలు నీట మునిగాయి.

నిలిచిన రాకపోకలు

వికారాబాద్ జిల్లా బంట్వారం మండల పరిధిలోని నూర్లాపూర్ వాగు, కోట్‌పల్లి మండల పరిధిలోని మాల్‌శెట్‌పల్లి వాగులు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తాండూరు మండల పరిధిలోని అల్లాపూర్, ఐనెల్లి, కొత్లాపూర్ గ్రామాల శివారులోని బండల వాగు, బెల్కటూర్ వాగు ఉప్పొంగడంతో కరన్‌కోట్, చిట్టిఘనాపూర్, చంద్రవంచ తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బొంకూరు గ్రామంలోని బిజ్వార్ గ్రామానికి వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోవడంతో బొంకూరు గ్రామానికి చెందిన విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేకపోయారు. బషీరాబాద్‌లోని పంచాయతీ భవనం, జడ్పీ పాఠశాల ఆవరణలో నీరు నిలవడంతో విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. యాచారం మండలం మాల్, నందివనపర్తి, నజ్దిక్‌సింగారం, తాటిపర్తి, చౌదర్‌పల్లి, యాచారం తదితర గ్రామాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండేందుకు వంటవారు ఇబ్బందులు పడ్డారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల పరిధిలోని వెంకిర్యాల-తంగళ్ళపల్లి వాగు ఉప్పొంగటంతో వెంకిర్యాల, తంగళ్లపల్లి, విశ్వనాథ్‌పూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తంగళ్లపల్లి నుంచి వెంకిర్యాల, ఆగిర్యాల, వెంకిర్యాల తాండ, విశ్వనాథ్‌పూర్, జిల్లేడ్-చౌదరిగూడ మండల పరిధిలోని కాస్లాబాద్‌తండా, కాస్లాబాద్, రావిర్యాల, ఎదిర, ముష్టిపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కులకచర్ల మండలం రాంనగర్ సమీపంలో కల్వర్టు నిర్మాణం లేక రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొందుర్గు మండల పరిధిలోని వెంకిర్యాల, తంగళ్లపల్లి, విశ్వనాథ్‌పూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగుల అవతల పొలాలు ఉండడంతో, ఉదయం పశువులు కొట్టం వరకు వెళ్లి, పాలు తీసుకురాని పరిస్థితి నెలకొంది. దౌల్తాబాద్ మండలంలోని పెద్ద చెరువులోకి వరద నీరు భారీగా చేరడంతో గుమ్మాల, బిచ్చాల్, తిమ్మాయిపల్లి, అల్లాపూర్ గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.



వికారాబాద్ : అలుగు పారుతున్న శివసాగర్ చెరువు



కొందుర్గు : పొంగిపొర్లుతున్న వెంకిర్యాల-తంగళ్లపల్లి వాగు



బంట్వారం : బ్రిడ్జిపై నుండి పారుతున్న నూర్లపూర్‌వాగు



షాబాద్ : నాగర్‌గూడ వద్ద నిండుగా పారుతున్న ఈసీ వాగు

ఉమ్మడి జిల్లాలో వర్షపాతం వివరాలు

రంగారెడ్డి జిల్లా

మండలం	ప్రాంతం	నమోదు(మి.మీ)
కేశంపేట్	తొమ్మిది రేకుల	62.0
మంచాల	ఆరుట్ల	40.3
మంచాల	బోడకొండ	38.5
యాచారం	యాచారం	31.8
మాడ్గుల	అర్కపల్లి	31.5
అబ్దుల్లాపూర్‌మెట్	అబ్దుల్లాపూర్‌మెట్	31.3
మహేశ్వరం	మహేశ్వరం	30.5

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మండలం	ప్రాంతం	నమోదు(మి.మీ)
కీసర	ఈఎస్‌ఎస్ కీసర	31.8
ఘట్‌కేసర్	ఈఎస్‌ఎస్ కొండాపూర్	26.0
అల్వాల్	టెలీకం కాలనీ	20.8
మల్కాజిగిరి	ప్రశాంత్‌నగర్	20.0
కాప్రా	ఈఎస్‌ఎస్ మల్కారం	20.0
కుత్బుల్లాపూర్	మహదేవ్‌పురం	20.0

వికారాబాద్ జిల్లాలో..

మండలం	నమోదు(మి.మీ)
చౌడాపూర్	70.2
కులకచర్ల	65.6
దుద్యాల	55.3
దౌల్తాబాద్	53.3
దోమ	51.6
పరిగి	55.0



బషీరాబాద్ : జడ్పీ ఉన్నత పాఠశాలలో నీటిలోంచి నడుచుకుంటూ వస్తున్న విద్యార్థినులు

గురుకులాల్లో సమస్యలు పరిష్కరిస్తాం

- ప్రభుత్వంపై బురదజల్లడానికే హరీష్ విమర్శలు
- రాష్ట్ర ముదిరాజ్ కో ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్



కేజీబీపీ విద్యార్థులతో మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్ ముదిరాజ్

శంషాబాద్ రూరల్, ఆగస్టు 31 : రాష్ట్రంలో ఉన్న గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారిస్తామని రాష్ట్ర ముదిరాజ్ కో ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. శనివారం శంషాబాద్‌లోని పాల్మాకుల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రులు హరీ‌ష్‌రావు, సబితారెడ్డి విమర్శలను ఖండించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అయ్యా.. హరీష్ గత నాలుగేళ్లలో పాల్మాకుల కేజీబీపీ సమస్యలు కనబడలేదా? అని ప్రశ్నించారు. గతంలో మీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉంది.. అప్పుడు పిల్లల సమస్యలు ఎందుకు పరిష్కరించలేదన్నారు. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లడం కోసమే హరీష్ రావు, సబితారెడ్డి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మీకు అధికారం పోయాక గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల సమస్యలు గుర్తుకొచ్చాయని అని ప్రశ్నించారు. గతంలో మీ ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను సరిచేసుకుంటూ పరిపాలన గాడిన పెట్టేలా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని అప్పులా కుప్పలుగా మార్చిన మీకు.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు మీకు లేదని మండిపడ్డారు. పిల్లలతో కలసి భోజనం చేశామని, నాణ్యమైన భోజనం పెడుతున్నారని చెప్పారు. కావాలనే కొందరు విద్యార్థులను రెచ్చగొట్టి రోడ్లపైకి వచ్చేలా చూస్తున్నారని విమర్శించారు. పాల్మాకులలో బీఆర్‌ఎస్ నాయకులు విద్యను కూడా రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్, చిలకమర్రి మహేందర్‌రెడ్డి, జిల్లా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహిస్తే ఎంతో సంతృప్తి





జ్ఞానేశ్వర్ దంపతులను, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీపీఆర్వో చెన్నమ్మ, తదితరులు

వికారాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగంలో బాధ్యతాయుతంగా పనిచేస్తే జీవితంలో ఎంతో సంతృప్తి కలుగుతుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో పబ్లిసిటీ అసిస్టెంట్‌గా పనిచేసిన కె.జ్ఞానేశ్వర్ ఉద్యోగ విరమణ అభినందన సభ డీపీఆర్వో చెన్నమ్మ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా పబ్లిసిటీ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన జ్ఞానేశ్వర్ తన అభీష్టం మేరకు ఫొటోగ్రఫీలో నైపుణ్యాన్ని మరింత చాటుకోవాలని, భావి జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ జ్ఞానేశ్వర్ సౌమ్యుడిగా, వివాదరహితుడిగా పేరు తెచ్చుకున్నారని, భావి జీవితం హాయిగా గడపాలన్నారు. అనంతరం కలెక్టర్, అదనపు కలెక్టర్, డీపీఆర్వో, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సిబ్బంది జ్ఞానేశ్వర్ దంపతులను శాలువాలు, జ్ఞాపికతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. డీఈవో రేణుకాదేవి, డీవైఎస్‌వో హనుమంతరావు, డీఎస్సీడీవో మల్లేశం, మెప్మా పీడీ రవికుమార్, రిటైర్డ్ డీపీఆర్‌వో నర్సిములు, ఏపీఆర్‌వో ప్రభాకర్, కార్యాలయం సిబ్బంది, తెలంగాణ సాంస్కృతిక కళాకారులున్నారు. అంతకుముందు కలెక్టర్ ఉద్యోగ విరమణ చేసిన మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

రిటైర్మెంటైనా పోలీస్ కుటుంబంలో భాగమే

వికారాబాద్, ఆగస్టు 31 : రిటైర్మెంట్ అయిన అధికారులు కూడా పోలీస్ కుటుంబంలో భాగమేనని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన సబ్ ఇన్‌స్పెక్టర్ యాదయ్య, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ యాకూబ్ అలీలను ఎస్పీ ఆధ్వర్యంలో శాలువా జ్ఞాపికలతో సత్కరించారు. అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏవో జ్యోతిర్మణి, పరిగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్‌ఐలు, ఎస్సైలు, జిల్లా పోలీస్ ప్రెసిడెంట్ అశోక్, డీపీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సన్మాన కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, తదితరులు



అల్కా లాంబాతో క్వీనీ

ఆమనగల్లు, ఆగస్టు 31 : పట్టణానికి చెందిన ఇంటర్‌నేషనల్ ఫిన్‌స్విమ్మర్ గంధం క్వీనీ విక్టోరియా శనివారం అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని ఆమె కార్యాలయంలో శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల ఆమె ఇంగ్లాండ్ నుంచి ఫ్రాన్స్ వరకు మౌంట్ ఎవరెస్ట్ ఆఫ్ స్విమ్మింగ్‌గా పిలువబడే ఇంగ్లీష్ చానల్ 36 కిలోమీటర్లు ఈది రికార్డు సృష్టించారు. దాంతో క్వీనీని అల్కాలాంబా అభినందించారు. తెలంగాణ ప్రభుత్వం ద్వారా తగిన సహకారం అందేలా చూస్తామని అల్కా హామీ ఇచ్చినట్లు క్వీనీ తెలిపారు.

మల్లారెడ్డి.. మౌనవ్రతం!

- ప్రసంగాల్లో దూకుడు తగ్గించిన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి
- ఇటీవల కార్యక్రమాల్లో మౌనంగా ఉంటున్న మాజీ మంత్రి



కీసర రూరల్, ఆగస్టు 31 : మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రసంగమంటే చాలామంది ఆసక్తి కనబరుస్తుంటారు. అలాంటిది ఈ మధ్య ఆయన పాల్గొంటున్న కార్యక్రమాల్లో ఎక్కువగా ప్రసంగించకపోవటం పట్ల కార్యకర్తలు, అభిమానులు అసంతృప్తిగా ఉన్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. సమావేశం ఏదైనా సభలో నవ్వులు పూయించే మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే మల్లారెడ్డి మౌనంగా ఉండటాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఆయన రెండు రోజులుగా దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీల్లో పర్యటించారు. లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసారు. దాంతో పాటు దమ్మాయిగూడ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలోనూ పాల్గొన్నారు. కానీ, ఎక్కడ కూడా మైక్ తీసుకోలేదు.. ఒక్క మాట మాట్లాడలేదు. దాంతో ప్రజలు, కొందరు నాయకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సభ ఏదైనా, సందర్భం ఏదైనా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, మాజీ మంత్రి కేటీఆర్‌ను పొగుడుతూ తన ప్రసంగాన్ని ప్రారంభించి తన లైఫ్ సక్సెస్ స్టోరీతో ముగించేవారు. మధ్యమధ్యలో చమత్కారాలు, ఛలోక్తులతో సభికులను కడుపుబ్బా నవ్వించేవారు. ప్రస్తుతం ఆయన పాల్గొంటున్న అధికారిక, అనధికార కార్యక్రమాల్లో మౌనంగా ఉంటున్నారు. ఏ విషయం గురించీ మాట్లాడటం లేదు. రాష్ట్రంలో అధికార పార్టీ కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ.. ఆయనేమో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కావటం వల్లనే ఎలాంటి ప్రసంగాలు చేయటం లేదేమోనని పలువురు చర్చించుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పని తీరును విమర్శించలేని, పొగడలేని పరిస్థితి నెలకొంది. ఏమైనా మాట్లాడితే ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోననే అభద్రతా భావంలో ఉన్నారేమోనని కొందరు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఏదిఏమైనా తన ప్రసంగాలతో నాయకులు, కార్యకర్తలు, ప్రజలను కడుపుబ్బా నవ్విస్తూ.. సంతోష పెట్టే ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిలో కొంత దూకుడు తగ్గిందని చాలామంది చర్చించుకుంటున్నారు.

మార్కెట్ యార్డులో ఇంటి దొంగలు!

- మాయమైన వరి ధాన్యం బస్తాలు
- ఆందోళన చెందుతున్న కమీషన్ ఏజెంట్లు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 31 : ఇంటి దొంగలను ఈశ్వరుడైనా పట్టుకోలేడన్న చందంగా మారింది షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డు పరిస్థితి. వరి ధాన్యం బస్తాలు మాయమై రెండు నెలలైనా నేటికీ ఖరీదుదారులు చెప్పడం లేదని కమీషన్ ఏజెంట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం బస్తాల దొంగతనంపై మార్కెట్ కమిటీ కార్యదర్శులు సైతం విచారణ చేయడం లేదని ఆవేదన చెందుతున్నారు. షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో 25 మంది కమీషన్ ఏజెంట్లు, 34 మంది ఖరీదుదారులు ఉన్నారు. వారిలో ఆరు మంది ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యంను కమీషన్ ఏజెంట్ల ద్వారా ఖరీదు దారులు కొనుగోలు చేస్తూ వస్తున్నారు. కొనుగోలు చేసిన ధాన్యంను కొందరు తమ రైస్ మిల్లులకు తీసుకువెళ్తుండగా, మరి కొందరు వివిధ ప్రాంతాలకు పంపిస్తున్నారు. రెండు నెలల క్రితం వరకు మార్కెట్‌లో దండిగా ధాన్యం క్రయవిక్రయాలు జరిగాయి. ఖరీదుదారులు కొనుగోలు చేసి, ధాన్యం బస్తాలను లారీల్లోకి ఎత్తే క్రమంలో పలువురి కమీషన్ ఏజెంట్ల ధాన్యం బస్తాలు మాయమైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెండ్యాల జగదీశ్వర్ అనే కమీషన్ ఏజెంటుకు సంబంధించిన 436 బస్తాల ధాన్యం, సారాపు వెంకటేష్‌కు సంబంధించి 150 బస్తాలు, పరిగి వెంకట సాయిశ్వర్‌రెడ్డికి సంబంధించి 73 బస్తాలు, మల్లేశ్వర్ స్వామికి సంబంధించి 39 బస్తాలు, కక్కునూరి పెంటయ్యకు సంబంధించి 23 బస్తాలు, గత సంవత్సరం 68 బస్తాల ధాన్యం మాయమైనాయి. ఈ విషయమైన తోటి ఖరీదు దారులను ప్రశ్నించినా ఫలితం లేకపోవడంతో కమీషన్ ఏజెంట్లు, తమ యూనియన్‌కు, మార్కెట్ కమిటీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఖరీదుదారులు కొనుగోలు చేసిన ధాన్యంతో పాటు తమ ధాన్యం బస్తాలను హమాలీలు లారీల్లో ఎత్తి ఉంటారని కమీషన్ ఏజెంట్లు గట్టిగా నమ్ముతున్నారు. ఈ విషయమై ఫిర్యాదులు చేసినా.. సంఘం నాయకులు, మార్కెట్ కమిటీ కార్యదర్శులు నేటి వరకు విచారణ చేయలేదు, మాయమైన బస్తాలను ఛేదించలేదని కమీషన్ ఏజెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు.



షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డు

విచారణ చేస్తా




మాయమైన ధాన్యం బస్తాల వ్యవహారం తన దృష్టికి వచ్చింది. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలతో పాటు వాటిని కూడా హమాలీలు లారీల్లో ఎత్తి ఉంటారు. ఖరీదుదారులను, కమీషన్ ఏజెంట్లను పిలిచి విచారణ చేస్తా. ధాన్యం బస్తాలు కోల్పోయిన కమీషన్ ఏజెంట్లకు న్యాయం చేస్తాం.

\- ఎన్. శ్రీనివాస్, స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి

అంబురామేశ్వరాలయం జాతరకు ఏర్పాట్లు

- పెద్దఎత్తున తరలిరానున్న భక్తజనం
- శ్రావణ సోమవారం సందర్భంగా ఉత్సవాలు





తట్టిపల్లి అటవీ ప్రాంతంలో నెలకొన్న అంబురామేశ్వరాలయం, కొలువుదీరిన శివలింగం

పెద్దేముల్, ఆగస్టు 31 : మండల పరిధిలోని తట్టిపల్లి అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ అంబురామేశ్వరాలయం ఉత్సవాలకు ముస్తాబైంది. శ్రావణమాసం చివరి సోమవారం.. సెప్టెంబరు 2న జాతరను ఘనంగా జరిపేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. తట్టిపల్లి అటవీ ప్రాంతంలో వెలసిన అంబురామేశ్వర దేవాలయం పరిసరాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఇక్కడ దట్టమైన అడవి.... పక్షుల కుహూ కుహూ రాగాలు.. జలజల పారే సెలయేరు. ఇక్కడికి వచ్చే భక్తులను ఎంతగానో ఆకర్షిస్తాయి. శ్రీరాముడే స్వయంగా ఇక్కడ శివలింగాన్ని ప్రతిష్ఠించాడని, పాండవులు అరణ్యవాసం చేసిన సమయంలో అజ్ఞాతవాసం చేస్తూ ఇక్కడి దట్టమైన అటవీప్రాంతంలో వారు కొంత కాలం గడిపారని, ఆలయం సమీపంలోని ఒకచెట్టుపై వారి అంబులు (ఆయుధాలు)దాచిపెట్టినందున ఆలయానికి అంబురామేశ్వరాలయం అనే పేరు వచ్చిందని స్థానికులు చెపుతుంటారు. అంబురామేశ్వరుడు కోరిన కోర్కెలు తీరుస్తాడని ప్రజలు విశ్వసిస్తారు. చుట్టుపక్కల గిరిజన గ్రామాల ప్రజలే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. పెద్దేముల్ మండలం తట్టిపల్లి, పాషాపూర్ గ్రామాల మధ్య గల అటవీప్రాంతంలోని లోయలో దేవాలయం ఉంది. చుట్టుపక్కల ఎక్కడ చూసినా పారే నీరు కనిపించదు కానీ, ఆలయం వద్ద గుట్టలో నుంచి నీరు ఉబికి వస్తుంటుంది. సోమవారం జాతర ఉత్సవాలు జరుగుతాయి. నేడు(ఆదివారం) సాయంత్రం గ్రామస్థులు అంబురామేశ్వరుడిని తట్టిపల్లి గ్రామంలో నుంచి భజనలు చేస్తూ భక్తులు పల్లకీలో ఊరేగింపుగా తీసుకువస్తారు. తెల్లవార్లు భజనలు నిర్వహిస్తారు. సోమవారం జాతర ముగిసిన తరువాత తిరిగి అదే పల్లకీలో గ్రామంలోకి తీసుకెళతారు.

ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి



ఘట్‌కేసర్ రూరల్: చెక్కులు అందజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 31: పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి అండగా నిలుస్తోందని ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలతో పాటు మండలంలోని 49మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, డీఆర్‌డీవో సాంబశివరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ రాజేందర్, ఎంపీడీవో గీతారెడ్డి, మున్సిపల్ చైర్మన్లు బోయపల్లి కొండల్‌రెడ్డి, ముల్లి పావనిజంగయ్యయాదవ్, మాదవరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ధర్మారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, శివశంకర్, నాయకులు కుమార్, కొండల్‌రెడ్డి, రమేష్, విశ్వనాథం, శ్రీనివాస్, శ్రీనివాస్, అంజిరెడ్డి, అర్ఐలు సాయిరాం, కావ్య పాల్గొన్నారు.

కీసర రూరల్: నాగారం మున్సిపాలిటీలోని స్టార్ ఫంక్షన్‌హాల్‌లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూరల మల్లారెడ్డి కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 74మందికి కల్యాణలక్ష్మి, ఆరుగురికి షాదీ ముబారక్ చెక్కులను అందజేసారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్, కమిషనర్ రాజేందర్ కుమార్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: మండలంలోని రైతు వేదికలో శనివారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మల్లారెడ్డితో మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్‌లు కలిసి 56మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం లక్ష్మాపూర్‌లో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ ఆలయంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నాగజ్యోతి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో పేదలకు భరోసా



మర్పల్లి: శ్రీనివాస్ తనయుడికి ఎల్‌వోసీ అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

మర్పల్లి, ఆగస్టు 31: సీఎం సహాయనిధి పేదప్రజలకు ఎంతో భరోసా ఇస్తోందని తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మండలంలోని బూచన్‌పల్లి అనుబంధ గ్రామం జాజిగుబ్బడి తండాకు చెందిన శ్రీనివాస్ తనయుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం తరఫున వైద్యం కోసం రూ.85వేలు విలువ గల ఎల్‌వోసీని శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్, జిల్లా నాయకులు రాములు, మాజీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

తాండూరు/పెద్దేముల్: సీఎం సహాయనిధి పేదలకు వరంలా మారిందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు శనివారం తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 39మంది లబ్ధిదారులకు రూ.16లక్షలు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పటోళ్ల బాల్‌రెడ్డి, ధారాసింగ్, హబీబ్‌లాల, రవీందర్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, రవిరాజ్ పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దేముల్ మండలానికి చెందిన ఏడుగురికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2లక్షలా 3వేల 500 విలువ గల చెక్కులను పెద్దేముల్ కాంగ్రెస్ నాయకులు, న్యాయవాది ఎల్లారెడ్డితో కలిసి ఎమ్మెల్యే తాండూరు ప్రజాభవన్‌లో అందజేశారు.

రూ.5 భోజన కేంద్రాలను ఏర్పాటు చేయాలి

తాండూరు, ఆగస్టు 31: రూ.5 భోజన కేంద్రాలను జిల్లా కేంద్రాలకే పరిమితం కాకుండా పట్టణ ప్రాంతాలకు విస్తరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పట్టణ ప్రాంతాల్లో ప్రారంభించినప్పటికీ కొన్నాళ్లకే మూతపడ్డాయి. గత ప్రభుత్వ హయంలో ఇస్కాన్ వారి సహకారంతో అన్నపూర్ణ క్యాంటీన్లను ఏర్పాటు చేసిన విషయం విధితమే. వ్యాపార, వాణిజ్య కేంద్రమే కాకుండా సమీపంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని ప్రజలు అవసరాల పనులు వ్యాపార, విద్య, వైద్య కోసం తాండూరు వస్తుంటారు. ముఖ్యంగా నియోజకవర్గం కేంద్రమైన తాండూరుకు కర్ణాటకలోని చించోళి, కుంచారం, సేడం ప్రాంతాల ప్రజలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం పోటీ పరీక్షల నేపథ్యంలో నిరుద్యోగులు గ్రంథాలయానికి వస్తుంటారు. వీరందరికి మధ్యాహ్నంవేళ చౌక ధరలో భోజనం అందించే రూ.5 భోజన కేంద్రాలు ఉండడంలేదు. చాలా మంది చాయ్, సమోసాలతో ఆకలి తీర్చుకుంటున్నారు. హోటళ్లలో భోజనం చేస్తే కనీసం రూ.100కావడంతో పేదలకు భారమవుతుంది. తాండూరులో చించోళి రోడ్డులోని శివాజీచౌక్, ఇందిరాచైక్‌లో అంబేడ్కర్ చౌరస్తా, రైల్వేస్టేషన్ మోర్ సూపర్ మార్కెట్, భద్రేశ్వర్ చౌక్‌లో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

హిందూ ఉత్సవ సమితి స్థలాన్ని చరిత్రాత్మక ప్రదేశంగా తీర్దిదిద్దుతాం



హిందూ ఉత్సవ సమితి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తాండూరు, ఆగస్టు 31: హిందూ ఉత్సవ సమితికి కేటాయించిన భూమికి నిధులు మంజూరు చేయించి, చరిత్రాత్మక ప్రదేశంగా తీర్చిదిద్దుతామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఆయన తాండూరులోని తన క్యాంప్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన హిందూ ఉత్సవ సమితి కార్యవర్గాన్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి నర్సింహులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

యాలాల: శ్రావణ మాసం చివరి శనివారాన్ని పురస్కరించుకొని యాలాల మండలంలోని బాగాయిపల్లి గ్రామంలో గల ఆంజనేయ స్వామి ఆలయంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యాలాల మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, కరుణం పురుషోత్తంరావు, బాల్ రెడ్డి, నర్సింహులు, హన్మంత్, బీమప్ప, గోపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అమృతయ్య, వెంకటయ్య, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందేలా చూడాలి

శామీర్‌పేట, ఆగస్టు 31: పదవీ విరమణ పొందే అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పూర్తి స్థాయిలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు సునీత డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ పొందే అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి, శామీర్‌పేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 65సంవత్సరాలు నిండి ఉద్యోగ విరమణ పొందే అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.2లక్షలు, రూ.లక్ష బెనిఫిట్‌ను వర్తింపజేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

బషీరాబాద్ ఎస్‌ఐగా గఫార్

బషీరాబాద్, ఆగస్టు 31: బషీరాబాద్ ఎస్‌ఐగా గఫార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ రమేష్ ఇటీవల కేసు విచారణలో భాగంగా ఓమహిళను తుపాకీతో కాల్చి చంపేస్తానని బెదిరించిన విషయం తెలిసిందే. ఈ విషయమై దినపత్రికాల్లో కథనాలు రావడంతో ఎస్పీ నారాయణరెడ్డి ఎస్‌ఐపై విచారణకు ఆదేశించారు. ఆ తర్వాత ఎస్‌ఐ రమేష్‌కుమార్ లాంగ్ లీవ్‌పై వెళ్లాడు. ఆయన స్థానంలో ఎస్పీ కార్యాలయంలో డీసీబీలో పని చేస్తున్న ఎస్‌ఐని ఇక్కడా నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా లాంగ్ లీవ్‌లో ఉన్న ఎస్‌ఐ రమేష్‌కుమార్‌ను ఎస్పీ కార్యాలయానికి ఆటాచ్ చేస్తూ డీసీఆర్‌బీ విభాగానికి బదిలీ చేసినట్లు పోలీస్ వర్గాల సమాచారం మేరకు తెలిసింది.

గిరిజనుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



పరిగి: తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఆగస్టు 31: గిరిజనుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గిరిజన సంఘాల ఆధ్వర్యంలో శనివారం పరిగిలో తీజ్(మొలకల పండుగ)ను నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొని ఎమ్మెల్యే పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గిరిజనుల జీవనవిధానం ఆచారాలు, సంస్కృతులను ప్రతిబింబించే విధంగా ఉంటాయన్నారు. గిరిజనుల ఆరాధ్యదైవమైన దండి మేరామా, సేవాలాల్‌ల ఆశయసాధనకు కృషిచేయాన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శాంతిబాయి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, ప్రధానకార్యదర్శి కె.హణ్మంత్‌ముదిరాజ్, మండల అధ్యక్షుడు బి.పరుశరాంరెడ్డి, గిరిజన సంఘం నాయకులు తావుర్యానాయక్, గోపాల్‌నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

పరిగి: పరిగి ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డి శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఎంపీడీవో ప్రభాకర్‌ను సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉద్యోగంలో చేరిన రోజునే ఉద్యోగ విరమణ తేదీ నిర్ణయించబడుతుందన్నారు. ఉద్యోగులు తమ సర్వీసులో పని చేసినంతకాలం మంచి సేవలు అందిస్తే ప్రజల మన్ననలు పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, తహసీల్దార్ ఆనంద్‌రావు, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా హామీల అమలు

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో శనివారం 26 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.హన్మంత్ ముదిరాజ్, మండల అధ్యక్షుడు బి.పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, నాయకులు అనెం అంజనేయులు, ఎన్.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



శనీశ్వరుడికి తైలాభిషేకం చేసేందుకు వచ్చిన భక్తులు

మోమిన్‌పేట్, ఆగస్టు 31: శ్రావణమాసంశని త్రయోదశి సందర్భంగా మండలంలోని ఎన్కతలలో వెలిసిన శ్రీ శనీశ్వరస్వామికి భక్తులు తైలాభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నలుపు వస్త్రం, పువ్వులు, నూనె, నెయ్యితో ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పురోహితులు, భక్తులు పాల్గొన్నారు.

కులకచర్ల: తిరుమలాపూర్ గ్రామంలో శ్రావణమాసం చివరి శనివారం శని త్రయోదశి సందర్భంగా పాండవుల గుట్టపై వర్షపాశం జారపోశారు. ప్రతీ సంవత్సరం శ్రావణ మాసం చివరి శనివారం గ్రామస్థులు పాండవుల గుట్టపై పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



కులకచర్ల: వర్ష పాశం పోస్తున్న గ్రామస్థులు

నేటి నుంచి నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరుడి జాతర

బషీరాబాద్: కొండకోనల మధ్య ఆటవీ ప్రాంతంలోని కోనేరు సప్తగుండాల మధ్య వెలసిన నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వర స్వామి ఆలయం జాతర ఉత్సవాలకు ముస్తాబైంది. ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివారం 1వ తేదీన పల్లకి సేవ, గంధాలు, 2వ తేదీన జాతర, సాయంత్రం రథోత్సవం, 3వ తేదీన జాతర ముగింపు కార్యక్రమాలు జరుగుతాయి. జాతర ఉత్సవాలకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పి.గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తాండూరు రూరల్ సీఐ అశోక్ నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు బషీరాబాద్ పోలీసులు తెలిపారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డితో పాటు పలువురు రాజకీయ నేతలు, ప్రముఖులు హాజరవుతారని ఆలయ కమిటీ చైర్మన్ పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. బషీరాబాద్ ఎంపీడీవో గాలి యాదయ్య శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. మధ్యాహ్న తాండూరు రూరల్ సీఐ ఆశోక్, ఎస్‌ఐ గఫార్‌తో కలిసి జాతర ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఆలయ కమిటీ చైర్మన్‌తో బందోబస్తు ఏర్పాట్లపై చర్చించి పరిసరాలను గుర్తించారు. ఎంపీడీవో వెంట సీనియర్ అసిస్టెంట్ శేర్‌ఖాన్ పాల్గొన్నారు.



జాతర ఏర్పాట్లపై చైర్మన్‌తో చర్చిస్తున్న ఎంపీడీవో యాదయ్య

చిన్న జాతరకు ముస్తాబైన రామలింగేశ్వరస్వామి ఆలయం

కులకచర్ల: శ్రావణమాసం చివరి మూడు రోజుల చిన్న జాతర ఉత్సవాలకు పాంబండ దేవాలయం ముస్తాబైంది. ఆదివారం శ్రీ రామలింగేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు, సోమవారం ప్రత్యేక పూజలు, సాయంత్రం బండ్లు తిరుగుట, మంగళవారం అమావాస్య ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్‌పర్సన్ నర్సమ్మ, ఈవో సుధాకర్ తెలిపారు.

సంక్షిప్తంగా..

● **వికారాబాద్:** గతంలో ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఎన్నెపల్లి చౌరస్తా వరకు రోడ్డు డివైడర్లో పెట్టిన కొనో కార్పస్ మొక్కలను ప్రజారోగ్యం దృష్ట్యా తొలగించామని, వాటిస్థానంలో శనివారం ఫాక్స్‌టైల్, డ్రాకేనా మొక్కలను నాటినట్లు వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ తెలిపారు.

● **బొంరాస్‌పేట్:** సీఎం రేవంత్‌రెడ్డిని బొంరాస్‌పేట్ మండలంలోని లగచర్ల గ్రామస్థులు కలిశారు. శనివారం హైదరాబాద్‌లో సీఎంను వారు కలిసి స్థానిక సమస్యలపై సీఎంకు వివరించారు. త్వరలో అన్నీ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీఎం హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్ పాల్గొన్నారు.

● **మోమిన్‌పేట్:** మండల కేంద్రంలో విద్యుత్ లైన్‌మన్‌గా పని చేస్తున్న లక్ష్మణ్ ధారూర్ మండలానికి బదిలీ కావడంతో ఆయనను విద్యుత్ శాఖ జిల్లా డీఈ సంజీవ్, ఏడీ సత్యనారాయణరెడ్డి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది వినోద్‌కుమార్, శర్ఫోద్దీన్, ప్రసాద్‌స్వామి, మహేశ్ పాల్గొన్నారు.

● **మేడ్చల్ టౌన్:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి ప్రసంగిస్తూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరి శ్రీశైలంరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర జానపద కళా సమితి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రదర్శనల్లో కొడంగల్ కళాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్‌గౌడ్, లింగయ్య, వ్యాపారవేత్త కొండల్‌రావు, జిల్లా అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి యం.కృష్ణయ్య, దౌల్తాబాద్ సాయిలు పాల్గొన్నారు.

● **మోమిన్‌పేట్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నయ్య బదిలీ కావడంతో శనివారం సన్మానించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో అధ్యాపకులు ఆయను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

● **మేడ్చల్ టౌన్:** విద్యార్థులు అపరిచితులతో వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేయరాదని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శనివారం మేడ్చల్ పట్టణం శ్రీనివాస కళ్యాణ మండపంలో స్ఫూర్తి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏసీపీ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ తెలంగాణ కార్యదర్శి డాక్టర్ మావుదూరి సూర్యనారాయణ మూర్తి, ప్రిన్సిపాల్ దేవరాజ్, యజమాన్య సభ్యులు గణేష్, సత్యనారాయణ, ప్రకాష్ పాల్గొన్నారు.

● **కొడంగల్ రూరల్:** కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 సంవత్సరానికి గెస్ట్ లెక్చరర్‌గా పని చేయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రఫియాఖానం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్, తెలుగు, హిందీ, జువాలజీ సబ్జెక్టులు బోధించడానికి విద్యా అర్హత సర్టిఫికెట్స్‌ను కళాశాలలో సోమవారం(రేపు) సాయంత్రం 4గంటల లోపు సమర్పించాలన్నారు.

● **ధారూరు:** ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సాయంత్రం పెసర పంట ఉత్పత్తులకు బీట్లు నిర్వహించారు. బీట్లలో పెసర క్వింటాల్‌కు రూ. 6,000ల నుంచి రూ. 7,7725 వరకు ధర పలికింది.

● ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ ఇంచార్జి కమిషనర్‌గా ఘట్‌కేసర్ కమిషనర్ ఎండీ సాబేర్ అలీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తు మున్సిపల్ శాఖ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పోచారం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన పశ్య వేమనరెడ్డి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో సమీప మున్సిపాలిటీ అయిన ఘట్‌కేసర్ కమిషనర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

● **తాండూరు రూరల్:** మండలంలోని కరన్‌కోట్ గ్రామ శివారులోని కేంద్ర ప్రభుత్వ రంగ సీసీఐ కర్మాగారంలో లోకోపైలెట్‌గా 39ఏళ్ల పాటు విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన శరణప్ప సేవలు అభినందనీయమని సీసీఐ కర్మాగారం కార్మికులు అన్నారు. సీసీఐ కర్మాగారంలోని సెక్షన్ ఆఫీస్‌లో సీసీఐ ప్రధాన గేటు సమీపంలో సీసీఐ కమ్యూనిటీ హాల్ ఎదుట సాయంత్రం రెగ్యూలర్, కాంట్రాక్ట్ కార్మికులు శరణప్పను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీలు నరేష్ సింగ్, బసయ్య, పరశురాం, అదిల్, అబిద్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రేమ వేధింపులు తాళలేక 9వ తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

బంట్వారం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో 10వ తరగతి విద్యార్థి వేధింపులు తాళలేక 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా బంట్వారం మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఓగ్రామానికి చెందిన విద్యార్థిని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. అదే పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సరిహద్దులో ఉన్న కర్ణాటకలోని లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన విద్యార్థి కొద్దిరోజులుగా ప్రేమిస్తున్నానంటూ వెంట పడుతున్నాడు. తనను పెళ్లి చేసుకోవాలంటూ వేధిస్తున్నాడు. దీంతో వేధింపులు తాళలేక సదరు విద్యార్థిని శుక్రవారం విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారు శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. పాఠశాల యాజమాన్యం వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థిని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేద్దామని వెళ్లిన సమయంలో విద్యార్థిని ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే 108 వాహనంలో తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తన కూతురిని వేధించిన విద్యార్థిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఇంకా ఫిర్యాదు చేయలేదని, తండ్రి ఫిర్యాదు చేసిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని బంట్వారం ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



సుద్దగనిలో నుంచి రమేష్ మృతదేహన్ని బయటకు తీసుకువస్తున్న పోలీసులు

పెద్దేముల్, ఆగస్టు 31: అనుమానాస్పద స్థితిలో ఓయువకుడు మృతిచెందాడు. ఈ ఘటన పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన బండమీది రమేష్(27) రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం అదే గ్రామానికి చెందిన ఎర్రవెంకటప్పతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం తాండూరు జిల్లా ఆస్పత్రికి వెళ్లారు. అయితే అదేరోజు సాయంత్రం వెంకటప్ప తిరిగి గ్రామానికి చేరుకున్నాడు. రమేష్ రాకపోవడంతో వెంకటప్పను అతడి తల్లి ప్రశ్నించింది. రమేష్ బుద్దారం గ్రామంలోని తన అక్కవద్దకు వెళ్తున్నానని తెలిపాడు. శనివారం ఉదయం గోపాల్‌పూర్ శివారులోని సుద్దగుంతలో పడి రమేష్ మృతదేహం ఉన్నట్లు గ్రామస్థులు అతడి తల్లికి సమాచారం అందించగా అక్కడికి వెళ్లిచూసింది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహన్ని పరిశీలించారు. తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని రమేష్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు.

చోరీ కేసుతో లింకు?

మండలంలోని రుద్రారం గ్రామంలో రెండు రోజుల కిందట గోపాల్‌రెడ్డి ఇంట్లో జరిగిన చోరీకి, రమేష్ మృతికి ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అనే విషయమై స్థానికులు చర్చించుకుంటున్నారు. రమేష్ మృతి అనుమానాస్పదంగా ఉండడంతో చోరీకి ఈ అనుమానాస్పద మృతికి ఏమైనా లింకులు ఉన్నాయా? అనే ఊహాగానాలు జనాల్లో రేకెత్తుతున్నాయి.

వృద్ధుడి అదృశ్యం



గోబిర్యానాయక్

కులకచర్ల, ఆగస్టు 31: ఇంటి ఉంచి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. కులకచర్ల మండలంలోని బండమీదితండా అనుబంధ గ్రామం తుపాకుల తండాకు చెందిన గోబిర్యానాయక్(71) ఆగస్టు 29న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు బంధువుల దగ్గర, తెలిసిన వారిని ఆరా తీసినా ఆయన ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం గోబిర్యానాయక్ కోడలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న ఎనిమిది సెల్‌ఫోన్లు రికవరీ

పరిగి, ఆగస్టు 31: పోగొట్టుకున్న ఎనిమిది సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు పరిగి ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన సయ్యద్‌అలీం, సి.మహేశ్, మహేందర్, ప్రసాద్, బాలరాజు, రంజిత్‌కుమార్, భగవంత్‌రెడ్డి, యాదయ్యలు తమ సెల్‌ఫోన్లు పోయాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సెల్‌ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించామన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత

యాలాల, ఆగస్టు 31: విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాతపడింది. ఈ ఘటన మండలంలోని అగ్గనూర్ గ్రామంలో జరిగింది. బాధిత రైతు నర్సింహులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అగ్గనూర్ గ్రామానికి చెందిన అక్కంపల్లి నర్సింహులుకు రెండు ఎడ్లు ఉన్నాయి. వీటితో ఆయన పొలం పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. వాటిలో ఒక ఎద్దు మేత వేసుకుంటూ గ్రామ సమీపంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లింది. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ వైరుకు తగిలి ఎద్దు అక్కడికక్కడే మృత్యువాతపడింది. ఎద్దు విలువ సుమారు రూ.60వేలకు పైనే ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పరిగి, ఆగస్టు 31: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. శుక్ర, శనివారాల్లో భారీ వర్షం కురిసిన నేపథ్యంలో విద్యుత్ స్విచ్‌లు, టీవీలు, ఫ్రిజ్‌లు, విద్యుత్ స్తంభాలకు దగ్గరగా వెళ్లరాదని సూచించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను, నీరు నిలిచే ప్రాంతాల్లో మరమ్మతు చేయిస్తామని తెలిపారు.


మర్పల్లి: ప్రజలు ప్రయాణం చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సురేశ్ అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు రోడ్డుపై ప్రయాణించే క్రమంలో తగుజాగ్రత్తలు పాటించాలని సూచించారు. వాగులు దాటే సాహసం చేయొద్దని, అత్యవసరమైతే తప్ప ఇళ్లలో నుంచి బయటకు రావద్దన్నారు.

పూడూరు: మండల పరిధిలోని గ్రామాల్లో ఎవరైనా శిథిలావస్థకు చేరినా ఇళ్లల్లో ఉంటే వెంటనే సురక్షితమైన ప్రాంతాల్లో లేదా తెలిసిన వారి ఇళ్లలో ఉండాలని చెన్గోముల్ ఎస్‌ఐ మధు సూధనరెడ్డి సూచించారు. చెట్ల కిందికి, స్తంభాలకు దగ్గరగా వెళ్లవద్దని, పిడుగుపాటుకు గురయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు.

బంట్వారం: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ప్రజలు ప్రవహించే వాగులు, చెరువులు, నీటి ప్రవాహాల వద్దకు వెళ్లకూడదన్నారు. గ్రామాల్లోని ఇనుప విద్యుత్ స్తంభాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లకు దగ్గర వెళ్లవద్దని సూచించారు.

తాండూరు రూరల్: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు ఎవరూ బయటికి రావద్దని తాండూరు తహసీల్దార్ తారాసింగ్ పేర్కొన్నారు. ఆయన శనివారం కార్యాలయంలో మాట్లాడారు. రాబోయే రెండు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సంఘటన జరిగితే కార్యాలయంలో జూనియర్ సహాయకులు టోల్ ఫ్రీ నెంబర్ 99490 84343 నెంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి



డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, ఆగస్టు 31: జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు అక్రమంగా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి అన్నారు. శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పల్వాన్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మామూలు జ్వరానికే డెంగీ వంటి ప్రమాదకర వ్యాధులని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు నామ మాత్రంగా రెండు గంటలు ఆస్పత్రిలో ఉండి అనంతరం ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారని, అలాంటి వారిని వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. ఆయనవెంట పట్టణ అధ్యక్షులు నరోత్తంరెడ్డి, వివేకానందారెడ్డి, రాజేందర్‌రెడ్డి, కేపీ రాజు, జిల్లా కార్యదర్శి బుస్స శ్రీకాంత్, అమర్నాథ్, డాక్టర్ రాజశేఖర్ ఉన్నారు.